# కౌముది - వెన్నెలలో వయ్యారి రామచిలుక

- రాసినవాడు - చండాలుడు

## (ఓ అజ్ఞాత పాఠకుడి అభినందన)

కౌముది వయస్సు రమారమి ఏణ్ణర్థం. ఇంకా ముక్కుపచ్చలారని బాల్యం అయితేనేం! కౌముది ఒక గొప్ప వెలుగు. తారాజువ్వలా రివ్వురివ్వున పైకి ఎగిసిపోతోంది. ప్రతీనెలా కొత్త ఇంధనం నింపుకుంటోంది.

కౌముది ద్వారా నాకు కొలకలూరి ఇనాక్, అందెశ్రీ,కందుకూరి రమేష్ మొదలుగు వారిని తెలుసుకునే భాగ్యం కలిగింది. ఇనాక్‌లా రాసే తెలుగు రచయితని ఈ మధ్య కాలంలో చూడలేదు. ఆయన స్వీయ చరిత్ర (autobiography) వ్రాస్తే పుస్తకంగా ముద్రించడానికి అయ్యే ఖర్చుకి $116/ నేను ఇచ్చుకుంటాను. నా ఆర్థిక పరిస్థితులు మెరుగైతే, ఇంకొంచెం ఎక్కువే ఇచ్చుకుంటాను. తక్కువ చెయ్యను. ఈయన వ్రాసిన 'అనంత జీవనం' ఈయన స్వీయచరిత్రా? ఏమో తెలియదు. ఈ పుస్తకం గురించి విన్నాను. ఇంకా చదవలేకపోయాను.

దాశరధి రంగాచర్య స్వీయచరిత్ర 'జీవనయానం' అన్న పేరుతో వచ్చింది. గొప్ప నిజాయితీతో వ్రాసాడీయన. ఆయన జీవితంలో జరిగిన అన్ని సంఘటనలని, ఆఖరికి కొడుకు ఆత్మహత్య కూడా వదిలిపెట్టలేదు. నా కష్టాలూ, కన్నీళ్ళూ చూడండి. కాలిన నా కొడుకు జీవితం తెలుసుకోండి. నా తండ్రి మా తల్లిగారిని పెట్టిన హింస చూడండి. తన ప్రాణస్నేహితుడైన ఒక ముస్లింకి దగ్గరుండి బువ్వతినిపించిన వైనంలో దేశ సమస్యలకి పరిష్కారం దొరుకుతుందేమో వెతకండి. ఒకటేమిటి నిజాయితీ అన్న దివిటీ వెలుగులో మొత్తం ఆయన బతుకు ముడిని ప్రపంచం ముందు విప్పాడు.

మంచి జీవిత చరిత్ర నిప్పులాంటి నిజాలని చూపిస్తుంది. కఠినమైన జీవితపాఠాలు బోధిస్తుంది. మంచి ఆలోచనలని పుట్టిస్తుంది. మంచి మార్గంలో నడిపిస్తుంది. మనుషులని కలుపుతుంది. విడగొట్టదు.

ఇనాక్ రచన ఈ కోవలోకి వస్తుంది. "నేను కోరేవాళ్ళని కాక నన్ను కోరే భాగీరథిగారిని పెళ్ళాడాను. కులం, మతం, వయస్సు, డబ్బు నిమిత్తం లేని పెళ్ళి. ఆమె నాకు భార్య మాత్రమే కాదు. తల్లి, గురువు, దైవం, అమ్మ తర్వాత అమ్మంత... గంభీర సముద్రం. మానవీయ మూర్తి. మానవతా జీవి. అంతటి అద్భుతమూర్తికి భర్తనయిన అదృష్టం నాది." (కొలకలూరి ఇనాక్, డిసెంబరు 2007 సంచిక)

పెళ్ళాం చులకన. కోరివచ్చినదైతే మరింత అలుసు. మాటకి మాట చెప్పిందా! అమెరికాలో పెద్ద ఉద్యోగం చేస్తున్న దేశీమొగుడు (కంప్యూటర్ సైన్సులో ఉత్తీర్ణుడు. మొన్నే అమెరికాలో ఎం.బి.ఏ కూడా చేసాడు) వెంటనే ప్రయోగించే అస్త్రం - విడాకులు. దిక్కుమాలిన చదువులు ఎన్ని చదివితే ఎందుకు? స్త్రీ అంటే గౌరవం లేకపోయాక!

మన దేశంలో పరిస్థితి మరీ దారుణం. నిన్ను ప్రేమించాను. నీ శరీరం నాది. నన్ను కాదంటే కత్తిపెట్టి కోస్తాను. పెట్రోలు పెట్టి తగలపెట్టేస్తాను. నీ కోరికలూ, ఇష్టాలూ, స్వతంత్ర భావాలూ నాకు శత్రువులు. నీ అందం నాకు దక్కకపోతే మరెవరికీ దక్కడానికి లేదు.

దుర్మార్గం! వీడు పొరపాటుపడుతున్నాడు. కామాన్ని ప్రేమ అనుకుంటున్నాడు. 'ప్రేమించుటయే నిజమైతే మన్నించుటయే ఋజువు కదా.' ఈ అమృత పలుకులు ప్రేమ స్వరూపాన్ని తెలుసుకున్న ఒక మహా జ్ఞాని అయిన కవి మాత్రమే వ్రాయగలడు. ఈ పవిత్ర దృష్టికీ ఆ

కామాంధుడి ఆలోచనలకి ఎంత తేడా? ఒకటి అమృతం! ఒకటి మురికి కూపం! కనపడుతున్న నరకం! రాక్షసం! మనజాతి ఎటుపోతుందో తెలుసు.

స్త్రీ అంటే గౌరవం, అంతకు మించి పవిత్రత ఉండాలి. ఇనాక్ భార్యని "తల్లి, తండ్రి, గురువు, దైవం.." అంటున్నాడు. పెళ్ళయ్యి కొన్ని దశాబ్దాలు దాటినా"... భాగీరథిగారిని పెళ్ళాడాను..." అంటూ భార్యని 'గారూ' అని సంబోధిస్తూ వ్రాసుకున్నాడు. ఆమె గంగా భాగీరథీ సమానురాలు.

ఇనాక్ రచనలో అసమానతల మంటల్లో కాలిన మాంసపు వాసన తగిలింది. "డాక్టరేటు చేసాను. వింతే. ప్రొఫెసరునయ్యాను. కొత్తే. డైరెక్టర్ను, సెక్రటరీని, డీన్ను, ప్రిన్సిపాల్ను, వైస్‌ఛాన్సలర్ను. కొత్తే! వీటికి వేటికీ యస్.సి. రిజర్వేషను లేదు. మా వాళ్ళు అప్పటిలో ఎవరూ కాలేదు. 20 ఏళ్ళ నుంచీ 62 ఏళ్ళ దాకా పనిచేసాను. అయినా అంటరానితనం నన్ను అంటుకుంటూనే ఉంది..."

ఈయన జీవిత కథ కావాలి. మనమూ, మన పిల్లలూ చదవాలి. నేర్చుకుని సరిదిద్దుకోవాలి. అంటరానితనం పేరుతో నేటికీ జరుగుతున్న యదార్థ సంఘటనలు బయటికి తేవాలి. మాదిగ వారినీ, మాలవారినీ, కోయలనీ, బోయలనీ నేటికీ పిడిగుద్దులు గుద్దుతున్న రెడ్డి ఆచూకీ తియ్యాలి. మంత్రాలు గొణుగుతూ, అసహ్యంతో దూరంగా పోతున్న బ్రాహ్మణుడి చిరునామా కావాలి. కాలితో డొక్కలో తన్నుతున్న కమ్మ భూస్వామి ఎక్కడున్నాడో పట్టుకోవాలి. వేళ్ళతో కళ్ళు పొడుస్తున్న వెలమదొర వైనం కావాలి.

ద్వేషంతో రగిలే రచన వద్దు. సమస్యని తెరవెనక దాచే రాత వద్దు. మొహమాటంతో సగం చెప్పి, సగం చెప్పని కథ వద్దు. ఉన్నది ఉన్నట్టుగా బతుకు పుస్తకాన్నితెరిచి చూపించగల రచయిత కావాలి. దీనికి సమర్థుడు ఇనాక్. పావలా కూలీ నుంచి ఎదిగి విశ్వవిద్యాలయానికి ఉపకులపతి పదవిని అలంకరించిన విజయుడు. దేనికీ జంకని గొంకని సాహసి.

"కులం తక్కువనే జనం చేత నాడూ, నేడూ పీడితుణ్ణి. ప్రేమ కోసం కొంగు పట్టిన బిచ్చగాణ్ణి... నా కోసం నవ్వకుండా, మీ కోసం ఏడ్చే రోజుకోసం అర్రులు చాచే అపరశాంతిని." అని చెప్పుకున్నాడు.

మన సంఘం పుట్టించిన మైలమంటల సెగ సోకినవాడు మాడి మందగించాలి. లేదా ద్వేషాన్ని తాగి చంపుతా, నరుకుతా అంటూ రాక్షసుడవ్వాలి. లేదా 'నీచులారా పొండి. మీకూ నాకూ సంబంధం లేదు.' అని దూరంగా పోయి కోపంగా చూడాలి. కానీ ఆశ్చర్యంగా, చాలా చిత్రంగా అగ్నిలో దూకిన సీతలా ఇనాక్ పునీతుడై దేవుడైపోయాడు. శాంతికపోతమై పోయాడు. ఆయన ప్రేమకోసం పట్టిన కొంగులో ప్రేమతో రచించిన ఈ నా రచనని వినయంగా పెడుతున్నాను. ఆయన మరిన్ని రచనల కోసం నా కొంగు ఆయన పాదాల చెంత పరుస్తున్నాను.

ఈయన్ని గుర్తించి ఎన్నుకుంటే ఉత్తమ 'రచనా'యకుడై జాతిని ముళ్ళడొంకలలోనుంచీ ఇవతలికి లాగి రహదారి పైకి ఎక్కించి వెలుగువైపు నడిపించగలడు. కొలకలూరి ఇనాక్ మనవాడు.

కౌముది గమనించింది. ఇనాక్ కనుకొలకల్లోనుంచీ జారిన కన్నీటి బిందువునొకటి 'అంతరంగతరంగాలు' శీర్షికలో ప్రచురించి అమెరికాలోని నాకు పరిచయం చేసింది. కౌముది ఋణం ఎలా తీర్చుకోవడం?

ఇప్పుడు అంతర్‌జాలంలో వస్తున్న తెలుగు పత్రికలన్నీ ఒకే సమయంలో నాకు ఇస్తే, ముందు కౌముది తీస్తాను. చకచక చదివేస్తాను. మీరు నమ్మరు. కొన్ని మరునాటికో, పైవారానికో ఉంచుకుంటాను. కౌముది నాకో తాయిలం. అయ్యో అప్పుడే చదవడం అయిపోయిందా? ఇంకొంచెం ఉంటే బావుండునే అనే భావన ఒక కొలమానం అయితే కౌముదిదే గెలుపు.

ఒక పత్రికని స్థాపించి ఒక స్థాయికి తీసుకురావాలంటే కొంత కాలం పడుతుంది. కౌముది విషయంలో కనీసం ఒక సంవత్సరం పడుతుంది అనుకున్నాను. అబ్బే! ఒక్క నెల కూడా పట్టలేదు. తొలి నెలనుంచీ(జనవరి,2007) ఇప్పటిదాకా క్రమం తప్పలేదు. నాణ్యత తగ్గలేదు.

నెలాఖరు. అర్థరాత్రి. తాజా సంచిక ప్రత్యక్షం. ఒక గంట ముందరే ఉంటుంది. ఒకసారి ఒకరోజు ముందర కూడా వచ్చిందని లీలగా గుర్తు. అంతర్‌జాలంలో వచ్చే ఉచిత పత్రిక కౌముది. ఒకరోజు ఆలస్యంగా వచ్చినా ఎవరూ ఏమీ అనుకోరు. ముందు వచ్చిందని మెచ్చుకోళ్ళూ ఎక్కువ ఉండవు. తెలుగువాళ్ళా మజాకానా? మరి కాంతి 'కిరణ్' ప్రభలకి ఎందుకో అంత శ్రద్ధ. తల్లితండ్రులకి కన్నబిడ్డ బాగోగులమీద ఉండే శ్రద్ధ లాంటి శ్రద్ధ.

ఆ శ్రద్ధ ఇంకో విషయంలో కూడా తెలుస్తుంది. అచ్చుతప్పులలో. ఒకసారి పనిపెట్టుకుని కాగడా వేసి వెతికాను. ఒక్క అచ్చు తప్పైనా దొరక్కపోతుందా అని. నా కంటికి కనపడలేదు. తెలుగు తల్లి సేవలో వీరిద్దరూ ఇంతింతై, అంతంతై మహా సైన్యమంతై పోయారు. ఆ భార్యాభర్తలకి ఇదే నా అక్షరాంజలి.

నిమిత, నిషిగంధ, గొల్లపూడి, కందుకూరి రమేష్ (అసమాన్యులు) వీళ్ళ రచనలు ముందర చదివేస్తాను. నా కంటి చూపు తుర్రుమంటూ ఎగిరిపోతున్న చిలక వెనక పరిగెట్టినట్టు వీళ్ళ రాతల వెనక పరుగెడుతుంది. ధర్మాత్ముడైన నిసార్(అసామాన్యులు, ఏప్రిల్-08) దోసిలిలో నుంచీ జారవిడవబడిన కూరగాయలలాగా వీళ్ళ రచనలు తాజాగా, నవనవలాడుతూ ఉంటాయి.

మందపాటి మందారమాల చదివి అబ్బ ఇంత తొందరగా తేల్చేసాడు. ఇంకో నాలుగు మందారాలు కూర్చి గుచ్చితే మాల ఇంకా బావుండునే అనుకుంటాను. భక్తిగిరిలోని బరువైన తత్వం ఆలోచింపజేస్తోంది. ఇది కష్టమైన రచన. అనుభవజ్ఞులైన వసుంధర దంపతులకే సాధ్యం.

నేడు అంతర్‌జాలంలో వచ్చే తెలుగు పత్రికలన్నీ మనవే. వాటి మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. అది నీరసిస్తున్న తెలుగు భాషకి మంచిదని నమ్ముతున్నాను. మీరు కౌముదిని స్థాపిస్తున్నామని తెలియజేసినప్పుడు సంతోషించాను. అగ్రస్థాయిలో చూడాలనుకున్నాను. ఒక ఏడాది శ్రమిస్తే ఒక మాదిరిగా గుర్తింపు వస్తుందేమో అనుకున్నాను! నాకేం తెలుసు? కౌముది మొదటి నెలనుంచీ చిటారు కొమ్మని ఎక్కి కూర్చుంటుందని? కౌముది తెలుగులకి గుళ్ళో దేవుడి ప్రసాదంలాంటిది!

ఇంతకీ కౌముది ఎలా ఉంది? అంటే -

**వెన్నెలలో ఎగురుతున్న రామచిలకలా వయ్యారంగా ఉంది! అందం, కొత్తదనం నా సొంతం అంది!**

✷✷✷